## క్లుప్తంగా

### ఘనంగా నీలమణిదుర్గ అమ్మవారి ఊరేగింపు



దుర్గమ్మ కాలనీలో ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గ్రామ తిరువీధుల్లో అమ్మవారి పట్టాభి జంగిడి, ఘటాల ఊరేగింపు కార్యక్రమం శనివారం కన్నుల పండువగా జరిగింది. తన కన్నవారి ఇంటి నుంచి బ్రాహ్మణవీధి మీదుగా దుర్గమ్మకాలనీ, గాంధీనగర్, టీచర్స్ కాలనీ, అచ్చుతాపురం గ్రామంలో ఘటలతో ఊరేగించారు. మహిళలు దారిపొడువునా చీరలు పరిచి అమ్మవారికి ఆహ్వానించారు. పట్టాభి జంగిడి పట్టుకున్న మహిళలకు ముగ్గురాటలతో అభిషేకాలు చేశారు. తల్లి ఆశీస్సులు పొందేందుకు భక్తులు తరలివచ్చారు.

- నీలమణిదుర్గ అమ్మవారిని ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాత్రి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### మూడు గ్రామాల్లో భూసర్వే ప్రారంభం

బూర్జ: సమగ్ర భూసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని కాలపర్తి పంచాయతీ సర్పంచ్ బిర్లంగి వరహాలునాయుడు అన్నారు. కాలపర్తి, చలికాం, జి.కె.ఆర్.పురం గ్రామాల్లో డ్రోన్‌తో భూసర్వేను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా ఉన్న భూసమస్యలు రీసర్వేతో పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసరావు, సర్వేయర్ క్రాంతికిరణ్, నాయకులు బగాది వెంకట రాజగోపాలరావు, పేడాడ దాసు, పలువురు రైతులు పాల్గొన్నారు.

### శిశువు వైద్యానికి ఆర్థిక సాయం

సరుబుజ్జిలి: చిన్న కొంగరాం గ్రామానికి చెందిన ఢిల్లేశ్వరరావు దంపతులకు నాలుగు రోజుల క్రితం మగబిడ్డ జన్మించాడు. అయితే పుట్టుకతోనే న్యూరో సమస్య తలెత్తడంతో తల్లి దండ్రులు తల్లడిల్లిపోయారు. చికిత్సకు ఐదు లక్షల రూపాయల వరకూ ఖర్చవుతోందని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక రేపటి పౌరులు ఫౌండేషన్ (ఆర్పీ) సభ్యులు అండగా నిలిచారు. పది వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని ఫౌండేషన్ సభ్యులు భార్గవ్, దాలిరాజు, రాములు ఢిల్లేశ్వరరావుకు శనివారం అందజేశారు.

### ముమ్మరంగా వాహనాల తనిఖీ

పాతపట్నం: నీలమణిదుర్గ అమ్మవారి పండుగల నేపథ్యంలో పాతపట్నం సరిహద్దు ప్రాంతం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పోలీసులు ముమ్మరంగా వాహనాలను శనివారం తనిఖీ చేశారు. శాంతి భద్రతలను పరిరక్షణకు పోలీసులు మరింత పటిష్టమైన చేపట్టారు. ఒడిశా నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ధ్రువపత్రాలేని వాహన చోదకుల నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు.

### కొత్తూరు ఎస్సైకు ఎస్పీ ప్రశంసలు



ఎస్సై గోవిందకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ రాధిక

కొత్తూరు: కొత్తూరు పోలీసుస్టేషన్ ఎస్సై మురపాక గోవిందను జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అభినందించారు. కేసుల దర్యాప్తులో వేగవంతం, కోర్టులో సకాలంలో చార్జిషీట్ల దాఖలు, మండలంలో నేరాలు తగ్గుముఖం పట్టడానికి చేసిన కృషిని అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. శ్రీకాకుళంలో శనివారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఈ మేరకు ఎస్సై గోవిందను ఎస్పీ అభినందించారు.

### ఉపాధి పనులు మంజూరు చేయాలని వినతి

కొత్తూరు: తన గ్రామానికి ఉపాధి పనులు మంజూరు చేయాలని గూనభద్ర గ్రామ పంచాయతీ సర్పంచ్ కల్లపల్లి వాణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కల్లపల్లి వైకుంఠరావు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో పావనికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఉపాధి పనులు పంచాయతీకి మంజూరు చేయకపోవడంతో వేతనదారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

### తిమడాంలో ప్రభుత్వ భవనాల ప్రారంభం రేపు

జలుమూరు: తిమడాం గ్రామంలో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలను సోమవారం సాయంత్రం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రారంభిస్తారని సర్పంచ్ వెలమల సత్యవతి శనివారం తెలిపారు. సుమారు రూ. పది కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ సెంటర్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, వైఎస్సార్ జగనన్న కాలనీ, వాటర్ ట్యాంక్, జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిలను ప్రారంభిస్తారన్నారు. అలాగే రాయితీపై రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ, ఉన్నత పాఠశాల స్థాపకుడు వెలమల లచ్చన్నాయుడు విగ్రహావిష్కరణ, రజకుల విశ్రాంతి భవనాన్ని కూడా ప్రజాప్రతినిధులు ఆరంభిస్తారని చెప్పారు. అనంతరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తారని చెప్పారు.

# వలంటీర్లు సంక్షేమ సారథులు

- స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం (ఇన్‌సెట్‌లో) ఏపీపేట పంచాయతీ కేకే రాజపురం గ్రామానికి చెందిన వలంటీర్ యరగాడ లక్ష్మిని సేవా వజ్ర అవార్డుతో సత్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



బూర్జ: గ్రామ వలంటీర్లు సంక్షేమ సారథులని స్పీకర్ తమ్మినేని సీతారాం కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కొల్లివలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఒకరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, 219 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులను ప్రదానం చేసి సత్కరించి అభినందించారు. అనంతరం స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యతలు గుర్తించి వలంటీర్లు బాధ్యతగా పనిచేస్తున్నారన్నారు. ప్రజా సేవలో నిమగ్నమవుతున్న వలంటీర్లను మూడు కేటగిరీల్లో ప్రభుత్వం వరుసగా మూడవ ఏడాది సత్కరిస్తుందన్నారు. వివక్ష, అవినీతికి తావులేకుండా వలంటీర్లు పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామ, వార్డు వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలిచి వారి మన్ననలు పొందాలన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. అవార్డులను స్ఫూర్తిగా తీసుకొని మరింత బాగా పని చేయాలని.. అవార్డులు రానివారు నిరుత్సాహపడొద్దన్నారు. రాబోయే రోజుల్లో వలంటీర్లకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకట్రావు, మండల కన్వీనర్ల కో ఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# అర్హతే ప్రామాణికంగా పథకాల వర్తింపు



జోదూరులో గిరిజనులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- జోదూరు సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మెళియాపుట్టి: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. జోదూరు గ్రామ సచివాలయం పరిధిలోని జోదూరు, జన్నిబంద, రాజపురం, నందలపాడు, కాపుసజ్జనాపురం, సవర సజ్జనాపురం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేయడంతోపాటు నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని కూడా అమలు చేస్తున్న సమర్థుడు ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి సంక్షేమ పథకాల డబ్బులు జమవుతున్నాయన్నారు. జన్నిబంద గ్రామ గిరిజనులు బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చొద్దని ఎమ్మెల్యేని కోరారు. దానికి ఆమె బదులిస్తూ గిరిజనులకు అన్యాయం చేసే ప్రక్రియ ముఖ్యమంత్రి చేయరని ధైర్యంగా ఉండాలన్నారు. జోదూరు గ్రామంలో బొల్ల ద్రాక్షాయణితో పాటు పలువురు ఇళ్ల పట్టాలు పొందిన మహిళలు మాట్లాడుతూ.. పుట్టింటివారు, అత్తింటివారు కూడా ఇవ్వని ఇంటిస్థలాన్ని ఆడపడుచులకు ముఖ్యమంత్రి కానుకగా ఇచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. అనపాన జానకమ్మ మాట్లాడుతూ.. తన భర్త చనిపోవడంతో ప్రభుత్వం ఆదుకుందన్నారు. సంక్షేమ పథకాలు, వైఎస్సార్ బీమా కలిపి రూ. 4 లక్షలు లబ్ధి పొందామని చెప్పారు. జన్నిబంద గ్రామానికి చెందిన సవర పోలమ్మ కుమారుడు గోపాలకృష్ణ బీటెక్ చదువుతుండగా.. విద్యాదీవెన, వసతిదీవెన పథకాల ద్వారా రూ.3 లక్షలు లబ్ధి చేకూరినట్టు ఎమ్మెల్యేకి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రకుమారి, ఏవో దానకర్ణుడు, పరిపాలనా అధికారి తిరుపతి పట్నాయక్, ఏపీవో రవికుమార్, ఆర్‌ఐ వైకుంఠరావు, కార్యదర్శి ఢిల్లేశ్వరరావు, వీఆర్వో అప్పలనాయుడు, పార్టీ మండల నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు భాస్కరదాస్, పల్లి యోగి, శశిభూషణరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, సర్పంచ్ బి.సరోజిని, జయమునిరావు, బాబూరావు, జమ్మయ్య, బి.కూర్మారావు, బాలకృష్ణ, సచివాలయ అధికారులు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# పాతపట్నంలో ఉచిత వైద్య శిబిరం



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ సాయిస్వాతి

పాతపట్నం: పాతపట్నంలో నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించనున్నట్లు వైద్యురాలు సాయిస్వాతి చెప్పారు. అంతరాబ కూడలి బస్‌షెల్టర్‌లో జెమ్స్ ఆస్పత్రి వైద్యులతో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీ వరకు వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. ప్రజలకు వడగాడ్పులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఫార్మసిస్ట్ అనిత, అనిల్, జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## నెహ్రూకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న దృశ్యం

పాతపట్నం: మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలను అందరూ కొనసాగించాలని విశ్రాంతి ఉపాధ్యాయుడు శిష్టు షణ్ముఖరావు అన్నారు. స్థానిక ఆల్‌ఆంధ్రా రోడ్డు సమీపంలో ఉన్న మండల పరిషత్ మోడల్ పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నెహ్రూ 59వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని నెహ్రూ విగ్రహానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.ఈశ్వరమ్మ, బి.తిరుపతిరావు, సత్యనారాయణ, స్వప్న, లత, నవరయ్య, పి.రామరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా చూడాలి

హిరమండలం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి సీహెచ్ సాయిగీత అన్నారు. వైద్యసిబ్బందితో సెక్టార్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జనన ప్రణాళిక, రవాణాపై అవగాహన కల్పించాలని, ఎన్‌సీడీ సర్వేలో అధిక రక్తపోటు, మధుమేహం రోగులను గుర్తించాలన్నారు.

## గ్రంథాలయానికి పుస్తకాల వితరణ


హిరమండలం: వేసవి శిక్షణ శిబిరాలను పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయానికి పాత హిరమండలం గ్రామానికి చెందిన అల్లాడ వెంకటరమణ పోటీ పరీక్షల జనరల్ స్టడీ పుస్తకాలను సమకూర్చారు. వీటిని గ్రంథాలయాధికారి కె.ఎర్రమ్మకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసరావు ఉన్నారు.

# 30 నుంచి శ్రీముఖలింగేశ్వర స్వామి కల్యాణం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం ముఖలింగేశ్వర స్వామి కల్యాణం ఈ నెల 30 నుంచి జూన్ నెల 4 వరకూ నిర్వహించనున్నట్లు ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు. 30న గణపతి పూజతో ప్రారంభించి ధ్వజారోహణ, బలిహరణ 31న జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి స్వామివారి తిరువీధి ఉత్సవం, పుట్టమన్ను తేవడం, శతమానం, మట్టిలు తీసుకొని రావడం, రాత్రి తొమ్మిది గంటలకు స్వామి కల్యాణం రాయబారం, పది గంటలకు కల్యాణం ఔపాసన అనంతరం రాత్రి పార్వతి పరమేశ్వరులను నంది వాహనంపై తిరువీధి ఉత్సవం, మే ఒకటిన స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. 2న సదస్యం, పండిత సభ, చతుర్వేద పారాయణం, మహా మంత్రపుష్పం, హారతి, 3న దొంగ వెళ్లి మైనాకోత్సవం, రాత్రి ఏడు గంటలకు మైనాకుని ఉత్సవం 4న నాగవల్లి, స్వామివారి వసంతోత్సవం, అనంతరం పవిత్ర వంశధార నదిలో పుణ్య పవిత్ర స్నానాలు ఉంటాయని పేర్కొన్నారు.

# సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో స్పీకర్ తమ్మినేని



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వస్తున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి 20వ వార్డు వెంగళరావు కాలనీలో శనివారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందించే లబ్ధిని తెలియజేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కాలువల నిర్మాణం చేపట్టాలని, మంచి నీటిని పూర్తిస్థాయిలో అందించాలని స్థానికులు స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలను ఇంటి వద్దనే అందిస్తున్నామన్నారు. ప్రజా పరిపాలన వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే సీఎంగా జగన్ అధికారం చేపట్టిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతిఒక్కరు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కోవిడ్ కష్టకాలంలో కూడా అణగారిన వర్గాలకి ఆర్థిక చేయూత అందించారన్నారు. ఎవరికైనా అర్హత ఉండి సాంకేతిక కారణాలతో పథకాలు అందకపోతే గ్రామ సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, వార్డు సచివాలయల కోఆర్డినేటర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, పార్టీ ముఖ్య నాయకులు బోర చిన్నంనాయుడు, పొదిలాపు తిరుపతి, స్థానిక నాయకులు కుప్పిలి సత్యనారాయణ, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు బొడ్డేపల్లి అజంతాకుమార్, దుంపల శ్యామలరావు, పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, బొడ్డేపల్లి రవికుమార్, సాధు చిరంజీవిరావు, మామిడి రమేష్, బొడ్డేపల్లి సూర్యారావు, మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, వివిధశాఖల అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్పీకర్‌ను కలిసిన ఇరిగేషన్ ఉద్యోగులు

ఆమదాలవలస: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఐడీసీ) ఉద్యోగులు స్పీకర్ తమ్మినేని సీతారాంను ఆమదాలవలసలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆరు నెలలుగా జీతాలు అందడం లేదని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.
స్పీకర్‌ను కలిసిన వారిలో ఆ శాఖ ఎస్ఈ ఎం.లక్ష్మీనారాయణ, ఈఈ ఎ.వి.ఎస్.ఎస్.ఆర్.ప్రసాద్, డీఈ ఎం.కామరాజుతోపాటు అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

## సీఎం జగన్‌ను కలిసిన గిరిజన నాయకులు

సారవకోట: ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు ఆధ్వర్యంలో గిరిజన నాయకులు ఢిల్లీ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. బోయి, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయాన్ని పునః పరిశీలించాలని, మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు.

## నేటినుంచి అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం నుంచి జరగనున్న అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎనిమిది రోజులు జరగనున్న టోర్నమెంట్లో 16 జట్లు పాల్గొంటున్నాయి. క్రికెట్ బాల్‌తో జరిగే పోటీలను స్థానిక సీనియర్ గ్రౌండ్ టీమ్ నిర్వహిస్తుందని కమిటీ ప్రతినిధులు నక్క రాము, రాకేష్, జయవర్ధన్, అనిల్ తెలిపారు. పోలాకి మండల జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి తదితరులు పోటీలను ప్రారంభిస్తారన్నారు.

## కుమార్తె అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

కొత్తూరు: తన కుమార్తె ఈ నెల 25 తేదీ నుంచి కనిపించడం లేదని పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం బత్తిలి పాత కాలనీకి చెందిన పరస శంకరరావు శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మురపాక గోవింద తెలిపారు. కొత్తూరులోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోందని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో తప్పడంతో సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు వెళ్లి తిరిగిరాలేదన్నారు.

## బీమా చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



క్రిష్ణవేణికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: కొత్తూరు మండలం నేరడి పంచాయతీ జోగిపాడు గ్రామానికి చెందిన లూకలాపు హరిముకుందరావు విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతని భార్య క్రిష్ణవేణికి వైఎస్సార్‌బీమా ద్వారా ఐదు లక్షల రూపాయలు మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును పాతపట్నంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో క్రిష్ణవేణికి.. ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు సీహెచ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

## నియామక పత్రం అందజేత

పాతపట్నం: కొత్తూరు మండలం మెట్టూరు బీట్-1 ఉపాధి హామీ పథకం క్షేత్రసహాకురాలుగా బుర్లె భాగ్యలక్ష్మి ఎంపికయ్యారు. ఈమెకు నియామక పత్రాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి తన క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు. బాధ్యతగా పని చేయాలని సూచించారు. పార్టీ నాయకులు సీహెచ్ సూర్యనారాయణ, బుర్లె శ్రీనివాసరావు, కొప్పల గీత ఉన్నారు.

## కారు బోల్తా.. తప్పిన ప్రమాదం

నరసన్నపేట: జాతీయ రహదారిపై గొట్టిపల్లి ఫ్లై ఓవరు వంతెన సమీపంలో శనివారం వేకువజామున మూడున్నర గంటల సమయంలో ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న వేగనార్ కారు బోల్తా పడింది. ఆ సమయంలో కారులో నలుగురు వ్యక్తులు ఉన్నప్పటికీ ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్‌తో పాటు కారులో ఉన్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారని ఎస్ఐ వై.సింహాచలం తెలిపారు. బరంపురం నుంచి సింహాచలం దేవస్థానానికి ముగ్గురు వెళ్తుండగా గొట్టిపల్లి ఫ్లైవర్ దాటిన వెంటనే కారు ముందు చక్రాల వీలు జాయింట్ విడిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. వెంటనే తేరుకున్న కారులో ఉన్న వారు డోర్ ఓపెన్ చేసుకొని బయటకు వచ్చారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే వారికి సహాయక చర్యలు అందించినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఎఫ్‌సీఐ ఉద్యోగికి తీవ్ర గాయాలు

నరసన్నపేట: సత్యవరం కూడలి సమీపంలో శ్రీకాకుళం నుంచి నరసన్నపేట వైపునకు వెళ్తున్న సర్వీసు రోడ్డులో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగివలస వద్ద ఎఫ్‌సీఐ గోడౌన్‌లో పనిచేస్తున్న పి.నాగేంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన గిడ్డంగుల వద్ద పని ముగించుకుని స్వగ్రామం ఉమ్మిలాడకు బైక్‌పై వెళ్తుండగా రాంగ్ రూట్‌లో వస్తున్న డీసీఎంఎస్ వ్యాను అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో నాగేంద్ర ఎడమ కాలితో పాటు చేతివేళ్లకు దెబ్బలు తగిలాయి. క్షతగాత్రుడిని ఎస్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది ఆస్పత్రికి తరలించారు.

# సేవా భావంతో పనిచేయాలి

- వలంటీర్లకు సన్మానంలో వక్తలు



సారవకోట: వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం



నరసన్నపేట: సత్కారం పొందిన వలంటీర్లు



కొత్తూరు: ఓండ్రుజోలలో వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం

సారవకోట: వలంటీర్లు సేవా భావంతో పనిచేయాలని సారవకోట ఎంపీడీవో విశ్వేశ్వరరావు అన్నారు. సారవకోట, పెద్దలంబ సచివాలయాల పరిధిలోని వలంటీర్లను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అప్పగించిన పనులను సేవాభావంతో చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సారవకోట, పెద్దలంబ పంచాయతీ కార్యదర్శి గౌరీ శంకర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ, సర్పంచ్‌లు కె.శంకరబాబు, ఇప్పై షణ్ముఖరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తేజేశ్వరరావు, కొండాల బాలకృష్ణ తదితరులున్నారు.

- నరసన్నపేట: నడగాం, లుకలాం, కామేశ్వరిపేట సచివాలయాల పరిధిలోని వలంటీర్లను ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ ఆరంగి మురళి మాట్లాడుతూ.. మండలంలోని 24 సచివాలయాల్లో ఉన్న వలంటీర్లు అందరినీ సత్కరించామని.. ఈ ప్రక్రియ శనివారంతో ముగిసిందన్నారు. ప్రతి వలంటీర్ బాధ్యతగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సొసైటీ అధ్యక్షుడు దాలినాయుడు, లుకలాం సర్పంచ్ తవిటినాయుడు, పార్టీ నాయకులు సురంగి నర్సింగరావు, బొబ్బాదీ ఈశ్వరరావు, చింతల వెంకటరమణ, దల్లు రమణ పాల్గొన్నారు.
- కొత్తూరు: వలంటీర్ల సేవలు అభినందనీయమని ఒండ్రుజోల సర్పంచ్ గందవరపు ఈశ్వరి అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఓండ్రుజోల గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామ వలంటీర్లను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతాడ సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు గందవరపు నాగేంద్ర, సనపతి సత్యం, సంకం వరహాలింగం పాల్గొన్నారు. కురిగాం గ్రామ సచివాలయంలో కూడా సర్పంచ్ సేపాన అశోక్‌కుమార్ వలంటీర్లను సన్మానించారు.

# సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నరసన్నపేట: కులాల వారీగా జనాభా లెక్కలు తేల్చేందుకు వీలుగా అధ్యాయన కమిటీని ప్రభుత్వం వేయడంపై నరసన్నపేటకు చెందిన బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పొందర సంక్షేమ సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రాజాపు అప్పన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో కుల గణన చేపట్టడం ఎంతో అవసరమన్నారు. దీనిని సీఎం గుర్తించి గణన చేపట్టేందుకు వీలుగా అధ్యాయన కమిటీని వేయడం ఆనందంగా ఉందన్నారు. సీఎం ఇచ్చిన మాట ప్రకారం కుల గణన చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం పట్ల నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధి ధర్మాన జగన్, వాన గోవిందరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, గుప్త, పొన్నాన తవిటి రాజు, గనగళ్ల శ్రీను, తోట భార్గవ్ పాల్గొన్నారు.

# జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీకి చర్యలు



జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న అధికారులు

పొందూరు: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభమయ్యేనాటికి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్ఎస్ఏ ఏఎంవో సీహెచ్ సుధాకరరావు, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ పూడి తిరుపతిరావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జేవీకే స్టాక్ పాయింట్‌లో భద్రపరిచిన జేవీకే కిట్లను శనివారం పరిశీలించారు. జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 92,818 మంది విద్యార్థులకు బెల్టులు, బూట్లు అందిస్తామన్నారు. అలాగే 20,942 మంది నాలుగో తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, 13,322 మంది ఒకటో తరగతి పిల్లలకు పిక్టోరియల్ నిఘంటువులు అందించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో రామరాజు ఉన్నారు.